ఆంధ్రజ్యోతి



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

శనివారం 10 మే 2025 | 5

దేశ సరిహద్దుల్లో..



మా కుమారుడు దేశ రక్షణలో భాగస్వామి కావడం ఆనందంగా ఉంది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో దేశ రక్షణకై పోరాడడం మామూలు విషయం కాదు.. ప్రాణాలెదురొడ్డి పోరాడాలి. మనం ఇక్కడ భయపడితే వారు అక్కడ భయపడతారు. అలా కాదు.. మనం ధైర్యంగా ఉండాలి.. వారిలో ధైర్యాన్ని నింపాలి.. ఇదీ అల్లవరం మండలం ఈటీవారి గ్రామానికి చెందిన యాటి చిన శివకుమార్ తల్లిదండ్రులు గోపాలరావు, కాశీరామేశ్వరి స్పందన. మా రెండో అబ్బాయి యాటి చినశివకుమార్ 20 ఏళ్లుగా ఆర్మీ ఎయిడ్ డిఫెన్స్ విభాగంలో విధుల్లో ఉంటున్నాడు. ప్రస్తుతం భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధం నెలకొన్న నేపథ్యంలో చిన శివకుమార్ జమ్మూ బోర్డర్ సమీపాన ఉద్దంపూర్‌లో సైనిక విధుల్లో ఉన్నాడని వారు తెలిపారు. కుటుంబ పరంగా ఆందోళన కలిగిస్తున్నా, దేశం తరపున పోరాడుతున్నందుకు గర్వంగా ఉందని తెలిపారు.



పవన్.. పెద్ద మనసు

- తన జీతం.. వారి జీవితాలకు..
- 42 మంది పిల్లలకు నెలకు రూ.5 వేల చొప్పున పంపిణీ
- ఆ వృద్ధురాలితో కలసి భోజనం

నాకు దాచుకోవడం తెలియదు.. పంచిపెట్టడం తప్ప.. ఎన్నికలకు ముందు ఒక బహిరంగ సభలో పవన్ చెప్పిన మాట ఇది.. నిజమే ఆయనకు దాచుకోవడం తెలియదు.. అందుకే పేదలను చూస్తే కరిగిపోతారు.. పవర్ స్టార్ పవన్‌కల్యాణ్ ఇప్పుడు మరో మంచి పనికి శ్రీకారం చుట్టారు. డిప్యూటీ సీఎం పదవి ద్వారా ప్రతి నెలా వచ్చే జీతం మొత్తం పిఠాపురం నియోజకవర్గంలో తల్లిదండ్రులు లేని 42 మంది చిన్నారులకు రూ.5 వేలు చొప్పన పంపిణీ చేయాలని తలంచారు.. దీనిలో భాగంగా శుక్రవారం చిన్నారులను మంగళగిరి రప్పించుకుని రూ.5 వేల చొప్పున అందజేశారు.. వచ్చే నెల నుంచి ఇంటి వద్దే పంపిణీ చేస్తారని ప్రకటించారు.. తనపై అభిమానం పెంచుకున్న ఒక 95 ఏళ్ల వృద్ధురాలిని ఇంటికి తీసుకెళ్లారు.. నీకేం కావాలవ్వా అని అడిగారు. నీతో భోజనం చేయాలని ఉంది బాబూ అనగానే ఆమెతో కలిసి భోజనం చేశారు.. చీర పెట్టి.. రూ. లక్ష ఇచ్చి కారులో ఇంటికి పంపారు.. - మెయిన్‌లో



హై..అలర్ట్!

భద్రత.. కట్టుదిట్టం

భారత్ - పాకిస్తాన్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో రోజురోజుకు పరిణామాలు మారుతున్నాయి. దేశవ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతాల్లో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. పోర్టులు, నౌకాశ్రయాల్లో భద్రత పెంచింది. సముద్ర జలాల ద్వారా ముష్కరులు వచ్చే అవకాశం ఉందన్న హెచ్చరికలతో తీర ప్రాంతాల్లో భద్రతను రెండంచెల స్థాయికి పెంచారు. జిల్లా పోలీసులు, కోస్టు గార్డ్ సిబ్బంది, కస్టమ్స్, పోర్టు అధికారులు అప్రమత్తమై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్లతో నిరంతరం నిఘాను పెంచుతూ తీరంలోని కదలికలను పరిశీలిస్తున్నారు. షిప్‌యార్డులు, సీ పోర్టుల్లో ఉన్న విదేశీ నౌకలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మరోవైపు మధురపూడి విమానాశ్రయం, రైల్వే స్టేషన్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.



- తీరాన ముమ్మర గస్తీ
- కోస్ట్‌గార్డ్, మెరైన్ బృందాల తనిఖీ
- చమురు నిక్షేపాలకు ప్రత్యేక రక్షణ
- విమానాశ్రయంలో రెడ్ అలర్ట్
- 800 ఏపీఎస్‌పీఎఫ్ సిబ్బంది
- 3 రోజులుగా సాగుతున్న మాక్‌డ్రిల్

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశ సంపదలో కీలకంగా ఉండే కృష్ణా గోదావరి బేసిన్ పరిధిలోని చమురు, సహజ వాయువు క్షేత్రాల వద్ద హైఅలర్ట్ ప్రకటించారు. తీర ప్రాంతం వెంబడి ఉన్న అపార చమురు నిక్షేపాలు కలిగిన ప్లాంట్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. శాటిలైట్ ద్వారా నిఘా పెంచారు. సముద్రం వెంబడి కోస్టుగార్డు, మెరైన్ పోలీసుల గస్తీ నౌకలు పర్యవేక్షిస్తున్నాయి. గత మూడు రోజులుగా కోనసీమలోని సముద్ర తీరం వెంబడి ఉన్న చమురు, గ్యాస్ నిక్షేపాల కేంద్రాల వద్ద సీఐఎస్ఎఫ్, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నారు. అనివార్య పరిస్థితుల్లో సైరన్ వినిపిస్తే ప్రజలు ఎలా స్పందించాలి అనే దానిపై కూడా వారు స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. రహదారులపై అర్ధరాత్రుళ్లు తనిఖీలు చేస్తున్నారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. ఎక్కడి నుంచి వస్తున్నారు? ఎక్కడికి వెళుతున్నారు? వంటి విషయాలపై ఆరా తీస్తున్నారు. మొత్తంగా కోస్తా తీరంలో బలగాలన్నీ అప్రమత్తమయ్యాయి.

- (అమలాపురం/ కాకినాడ/ రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



తీరాన నిఘా...

కోనసీమ జిల్లా పరిధిలోని అంతర్వేది నుంచి ఐ.పోలవరం మండలం హోప్‌ఐలాండ్ వరకు ఉన్న సముద్ర తీరం వెంబడి అపార చమురు, సహజ వాయువుల నిక్షేప కేంద్రాలు ఉన్నాయి. సముద్రపు లోతు జలాల్లో బావుల ద్వారా ఉత్పత్తి అయ్యే గ్యాస్, ఆయిల్‌ను ప్లాంట్ల ద్వారా శుద్ధిచేసి విశాఖ లేదా ఇతర రాష్ట్రాలకు తరలించడం ద్వారా వేల కోట్ల ఆదాయాన్ని ఆ సంస్థలు ఆర్జిస్తున్నాయి. జిల్లా పరిధిలోని రిలయన్స్, జీఎస్‌పీఎస్, ఎస్.యానాంలోని వేదాంత, ఓడలరేవులోని ఓఎన్జీసీ ప్లాంటు, కేశనపల్లి, కరవాక ప్రాంతాల్లో ఉన్న ప్లాంట్లతో పాటు అత్యంత కీలకంగా ఉండే నగరంలోని జీసీఎస్‌లతో పాటు కోనసీమవ్యాప్తంగా 30కు పైగా ప్రాంతాల్లో చమురు, సహజవాయువుల అన్వేషణ కేంద్రాలు ఉన్నాయి. సీఎస్ఎఫ్, అగ్నిమాపక, పోలీస్‌తో పాటు స్థానికంగా ఉండే వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తూ ఆయా ప్రాంతాల్లోని ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు, అనుమానాస్పద వస్తువులు కనిపించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, మెరైన్ పోలీసులు, వేదాంత సిబ్బంది స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాంట్ల పరిసరాల్లో ప్రజల కదలికలపై నిఘా ఉంచాల్సిందిగా సూచించారు. చమురు క్షేత్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఇతర వ్యక్తుల సంచారంపై నిఘా ఉంచాలని, సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, వారి కదలికలపై కూడా నిఘాను పటిష్టం చేయాల్సిందిగా సూచించారు. సముద్రపులోతు జలాల్లో ఉన్న వివిధ సంస్థలకు చెందిన ఆఫ్‌షోర్ ప్లాట్‌ఫారాల వద్దకు నౌకలు, భారీ బోట్‌లు వంటివి ప్రయాణించకుండా కోస్ట్‌గార్డు బృందాలు నిఘా ఉంచాయి. రిలయన్స్, గుజరాత్ పెట్రోలియం, ఓఎన్జీసీ సంస్థలతోపాటు ఇతర ప్రైవేటు సంస్థలకు చెందిన ప్లాట్‌ఫారాల ద్వారా చమురు, సహజవాయువుల అన్వేషణ జరుగుతోంది. మరో వైపు కాకినాడ యాంకరేజ్, డీప్‌వాటర్ పోర్టులో భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. కేసీపీఎల్‌లో కూడా వచ్చే, వెళ్లే షిప్‌లను పరిశీలిస్తున్నారు. సముద్రంలో కేజీ బేసిన్ చమురు క్షేత్రాలు సమీపంలోకి ఎవరూ రాకుండా ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. సీకోస్టల్‌లో ఎక్కువగా కర్మాగారాలు, ఆయిల్ రిఫైనరీలు అధికంగా ఉన్న నేపథ్యంలో స్థానిక సెక్యూరిటీ విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు తీర ప్రాంతంలో పెట్రోలియం స్టోరేజ్ కేంద్రాలు, కర్మాగారాల్లో భద్రతా సిబ్బందిని జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తం చేసింది. ఐవోసీఎల్, బీపీసీఎల్,హెచ్‌పీసీఎల్ వంటి పెట్రోలియం స్టోరేజ్ కేంద్రాలు, కార్మాగారాల్లో ఇతరులను అనుమతించొద్దని భద్రత సిబ్బందికి హెచ్చరికలు జారీచేశారు. అలాగే బాంబ్ స్క్వాడ్స్, డ్రోన్ బృందాలు, కోస్ట్ గార్డ్స్ కేఎస్‌పీఎల్ సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు.



ఎస్.యానాంలో వేదాంత ప్లాంట్ వద్ద స్థానికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రశాంతకుమార్

విమానాశ్రయంలో అణువణువు తనిఖీలు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక రక్షక దళం(ఏపీఎస్‌పీఎఫ్) అప్రమత్తమైంది.కమాండెంట్ కేఎన్ రావు స్వీయ పర్యవేక్షణలో భద్రత కట్టుదిట్టం చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరిలోని అన్నవరం దేవస్థానం, కాకినాడ రిలయన్స్‌ఓఎన్‌జీసీ రిగ్‌లు, యాంకరేజీ పోర్టు, రాజమండ్రి ఓఎన్‌జీసీ బేస్ పరిధిలోని కోనసీమ జిల్లాలోని కృష్ణా-గోదావరి బేసిన్ బావులు, రాజమహేంద్రవరం విమానాశ్రయం, బ్యాంకు చెస్ట్‌లకు ఏపీ ఎస్‌పీఎఫ్ సుమారు 800 మంది సుశిక్షితులైన పోలీసులతో భద్రత కల్పిస్తోంది. కోనసీమలోని గ్యాస్ పైపులైన్లను నిరంతరంగా పహారా కాస్తున్నారు. రాజమండ్రి ఎయిర్ పోర్టులో రెండంచెల భద్రత ఏర్పాటు చేశారు. వీవీఐపీ, వీఐపీ వంటి హోదాలతో సంబంధం లేకుండా ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అన్నిచోట్లా నిఘా ముమ్మరం చేశారు. మెటల్, లగేజీ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. సందర్శకులను ఇప్పటికే నిషేధించారు. రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో స్వీయ రక్షణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ), సిబ్బంది ఎప్పుడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఎలా స్పందించాలనే దానిపై అవగాహన కల్పించారు.



కాకినాడలోని పెట్రోలియం స్టోరేజ్ కేంద్రాలు, కర్మాగారాల్లో భద్రత సిబ్బందిని అప్రమత్తం చేస్తున్న పోలీసులు

మేం సిద్ధంగా ఉన్నాం..



ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ఆయుధ సంపత్తితో సిద్ధంగా ఉన్నాం. పర్యవేక్షణ అధికారులు నిరంతరం విధుల్లోనే ఉంటున్నారు. సిబ్బందికి తరచుగా ఆయా ప్రదేశాల భద్రత, ప్రజల రక్షణపై సూచనలు చేస్తున్నాం. యుద్ధం మన వరకూ వచ్చినా ప్రాణాలొడ్డి పోరాడతాం.

- కేఎన్ రావు, కమాండెంట్, ఏపీ ఎస్‌పీఎఫ్

సేకరించిన ధాన్యం 2.86 లక్షల టన్నులు

జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా అంచనా వేశామని జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం సేకరణలోని పరిస్థితులను శుక్రవారం నాటికి వివరించారు.ఇప్పటి వరకూ 39,856 కూపన్లు జనరేట్ చేసి 24,798 మంది రైతుల నుంచి 2,86,684.840 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. 31,582 ఎఫ్‌టీవోలకు రూ.550 కోట్ల 26 లక్షలు ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. 62 లక్షల గోనె సంచులు రైతులు వినియోగించారన్నారు.ప్రభుత్వ నిర్ణయం ప్రకారం కామన్ వెరైటీ క్వింటా రూ.2300, గ్రేడ్-ఏ క్వింటా రూ.2320 చెల్లించడం జరుగుతుందన్నారు. 2833 వాహనాలకు జీపీఎస్ అమర్చి ధాన్యం ర వాణాకు ఉపయోగించామన్నారు.సేక ర ణ లక్ష్యం పెంచడం వల్ల ఇప్పటి వరకూ 3302 మంది రైతులు లబ్ధి పొందారన్నారు.

గోదావరి తీర ప్రాంతాల అభివృద్ధికి కమిటీ

రుడా వైస్ చైర్మన్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరంసిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): గోదావరి పరిసర ప్రాంతాల అభివృద్ధి,సుందరీకరణ తదితర పనుల పరిశీలనకు కమిటీ ఏర్పాటు చేశామని రుడా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్ తెలిపారు. రుడా కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్షించారు. రుడా అథారిటీ పరిధిలో అర్బన్ లోకల్ బాడీస్, పంచాయతీల నుంచి వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనను పరిశీలించేందుకు కమిటీ ఏర్పాటు చేశామన్నారు. రైతులు ,ఇతర ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూసమీకరణ పథకం ద్వారా భూమిని సేకరించి రెసిడెన్షియల్ లేఅవుట్లు అభివృద్ధి ,హెల్త్ హబ్స్, టూరిజం ప్రాజెక్టులను చేపట్టడంపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో రుడా సెక్రటరీ ఎంవీఆర్ సాయిబాబా,చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జీవీఎస్ఎన్.మూర్తి ,ఈఈ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం



నియామకపత్రాలతో యువతీవయువకులు..



మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

- నిడదవోలులో మెగా జాబ్ మేళా
- 1038 మందికి ఉద్యోగాలు
- త్వరలో టూరిజం జాబ్‌మేళా
- మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, మే 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫి శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలోని వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వికాస జేకేసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను మంత్రి దుర్గేష్ జ్యోతి ప్రారంభించి మాట్లాడారు. జాబ్ మేళాకు సుమారు 42 కంపెనీలు హాజరయ్యాయని ఆయా కంపెనీల్లో రెండు వేలకు పైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు.ఈ జాబ్ మేళాలో ఐటీ రంగానికి చెందిన కంపెనీలు అధికంగా వచ్చాయని..త్వరలో నిర్వహించే మరో జాబ్ మేళాలో టూరిజం, ఆతిథ్య రంగాలకు సంబం ధించిన కంపెనీలను ఆహ్వానిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లా డుతూ కూటమి ప్రభుత్వంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించి తీరుతామన్నారు. అనంతరం జాబ్ మేళాలో కార్పోరేట్ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 2386 మంది హాజరుకాగా 1038 మంది ఉద్యోగాలు సాధించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వికాస పీడీ కె.లచ్చారావు,జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి మురళి, కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ రుద్ర, డాక్టర్ కె.జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

పిల్లలు తప్పిపోవడం ఆందోళనకరం

న్యాయవిజ్ఞాన సదస్సులో డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి



మాట్లాడుతున్న డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర అంశాలపై సంబంధిత అధికారులతో డీఎల్ఎస్ఏలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో స్నేహాలు పిల్లల అక్రమ రవాణాకు ఊతమిస్తున్నాయన్నారు. కుటుంబీకుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటే ఇలాంటి నేరాలకు అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. తప్పిపోయిన పిల్లల ఆచూకీ అంత సులభంగా లభించదని,వారి పరిస్థితి ఆందోళనకరంగా మారుతుందన్నారు.నల్సా వారి 'అక్రమ రవాణా బాధితులు, వాణిజ్య పరమైన లైంగిక దోపిడీ బాధితుల పథకం-2015' ద్వారా అందిస్తున్న న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. అలాంటి కేసుల్లో ఉచిత న్యాయ సహాయం కోసం డీఎల్ఎస్ఏని సంప్రదించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, డీఎస్ ఈవో వాసుదేవరావు,అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్ఎం వలీ తదితరులు పాల్గొన్నారు

అకాల కష్టం!

పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో కుమ్మేసిన వాన

పెరవలి/ఉండ్రాజవరం,మే 9(ఆంధ్రజ్యోతి): అకాలనష్టం.. అన్నదాతను నిండా ముంచేసింది. ఎప్పుడు ఎండ వస్తుందో..ఎప్పుడు వానొస్తుందో తెలియడం లేదు.. శుక్రవారమే ఉదయం నుంచి భానుడు సుర్రుమనిపించాడు..కాసేపటికే మబ్బువేసింది.అంతే నిమిషాల్లో వరుణుడు వచ్చేశాడు.. పెరవలి, ఉండ్రా జవరం మండలాల్లో సుమారు గంట న్నర సేపు దంచి కొట్టాడు.దీంతో మురుగు డ్రెయిన్‌లు పొంగి ప్రవహించాయి.రోడ్లపై ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే గంటలో సుమారు మూడు నుంచి నాలుగు దుక్కు లు వర్షం కురిసిందని పలువురు పేర్కొంటు న్నారు. వర్షంతో పాటు ఈదురుగాలులు వీయడంతో చాలా చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌పార్మర్లు దెబ్బతిన్నాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ స్థంభాలపై చెట్లు పడిపోవడంతో కొద్దిసేపు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.ఉండ్రాజవరం నుంచి చివటం వెళ్లే రోడ్డులో కొబ్బరిచెట్టు విద్యుత్ తీగలపై పడింది.ఉండ్రాజవరం, తాడిపర్రు, మోర్త, వెలగదుర్రు గ్రామాల్లో ఈదురు గాలులుకు అరటి చెట్లు పడిపోయాయి. పలు చోట్ల వరిచేలు నేలకొరిగాయి. అక్కడక్కడా అరటి చేలు నేలవాలాయి.



ఉండ్రాజవరంలో నేలకొరిగిన వరి చేను



వెలగదుర్రులో నేలకొరిగిన అరటితోట..తీపర్రులో కూలిన చెట్టు





కాకరపర్రు వద్ద అరటితోటలో నిలిచిన నీరు

సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లకు...
అరుంధతి నక్షత్ర దర్శనం

● కోలాహలంగా గ్రామోత్సవం
● ఆకట్టుకున్న దేవతామూర్తుల వేషధారణలు

అన్నవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి వార్షిక దివ్య కల్యాణోత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల అరుంధతి నక్షత్ర దర్శ నాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పు రాజగోపురం వద్దకు మేళతాళాలతో తోడ్కొని వచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం దాంపత్యజీవితానికి ప్రతీకలైన వశిష్ట, అరుంధతి నక్షత్రాలను చూపించి వారికి అర్ఘ్యం అర్పించారు. సాయంత్రం ఐదు గంటలకు దర్బారు మండపంలో ప్రధానార్చ కుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు ప్రధాన ప్రవేశ స్థాలీపాక హోమాలు నిర్వహించారు. వివాహం అనం తరం అమ్మవారు మెట్టినింటికి చేరుకుని అక్కడి నుంచి మరో జీవన ప్రయాణానికి నాంది పలికేందుకు ప్రతీకగా ఈ వేడుక జరిపారు. చతుర్వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. గ్రామోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు స్వామి,అమ్మవార్లను రావణబ్రహ్మ వాహనంపై ఆశీనులు గావించి విహరింపజేశారు. పలు సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గ్రామోత్సవం కోలాహలంగా సాగింది. స్వామివారి వాహనసేవల్లో రావణ వాహన సేవకు అధిక ప్రాధాన్యం ఉండడంతో అన్నవరం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి తిలకించారు. తప్పెటగుళ్లు, కోలాటం, వివిధ దేవతా మూర్తుల వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి.


రావణబ్రహ్మ వాహనంపై నూతన దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి గ్రామోత్సవం


నూతన దంపతులకు అరుంధతి నక్షత్రం చూపుతున్న రుత్వికులు




అన్నవరంలో సాంస్కృతిక కార్యక్రమాల దృశ్యాలు


విజయవాడలో భవనాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

రూ.1.30కోట్లతో రెడ్‌క్రాస్ భవనం

వర్చువల్ విధానంలో ప్రారంభించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

కార్పొరేషన్ (కాకినాడ), మే 9 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా శాఖ రూ.1.30 కోట్లతో కాకినాడలో మూడు అంతస్తుల్లో శిశు సంరక్షణ, మహిళా సంక్షేమ, శిక్షణ కేంద్రాన్ని నిర్మించింది. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా విజయవాడ రాజ్‌భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో దీనిని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తన సతీమణితో కలిసి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, రెడ్‌క్రాస్ జిల్లా, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వైడీ రామారావు, భవన నిర్మాణ దాతలు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి, ఓఎన్జీసీ చీఫ్ జనరల్ మేనేజరు జి.భాస్కర్‌రావు జెమినీ ఎడిబుల్ ఆయిల్స్ జనరల్ మేనేజరు ఎస్.గురుప్రసాద్, గవర్నర్ కార్యదర్శి హరి జన హర్‌లాల్, రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీదా, కోశాధికారి పి.రామ చంద్రరాజు పాల్గొన్నారు. కింది అంతస్తులో శిశు గృహ ఏర్పాటు చేస్తున్నామని, మొదటి అంతస్తులో మహిళా శిక్షణ కేంద్రం, రెండో అంతస్తులో మహిళా అభ్యుదయ కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్, చైర్మన్ వైడీఆర్ గవర్నర్‌కు తెలిపారు. కాకినాడ శాఖ చేస్తున్న కార్యక్రమాలను గవర్నర్ ప్రశంసించి భవన నిర్మాణదాతలకు పుష్పగుచ్ఛాలిచ్చి సత్కరించారు.

వ్యాన్ ఢీకొని వృద్ధుడి మృతి


మృతిచెందిన సత్యనారాయణ

తాళ్లరేవు, మే 9 (ఆంధ్రజ్యోతి): టాటా ఏస్ గూడ్స్ వ్యాన్ ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం బ్రహ్మపురికి చెందిన మడికి సత్యనారాయణ (65) సుంకరపాలెం రోడ్డుపై వస్తుండగా వాహనం అదుపు తప్పి ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కోరింగ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ఈ సంఘటనపై కోరింగ ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..


మృతిచెందిన నూకరాజు

కరప, మే 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన యర్రంనీడి సత్యనూకరాజు(69)కు మతిస్థిమితం సరిగాలేక అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగి వచ్చేవాడు. అలాగే ఈ నెల 8వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతసేపటికీ తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం రోడ్డుపక్కన తలకు రక్తపుగాయంతో స్పృహ లేకుండా పడి ఉన్న నూకరాజును అదే గ్రామానికి చెందిన గణేష్ గుర్తించి అతడి కుమారుడికి సమాచారం అందించాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చనిపోయినట్టు నిర్ధారించుకున్న కుటుంబసభ్యులు కరప పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ

కాకినాడ క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌లో కె.లేఖా నిహారిక ప్రతిభ కనబరిచి జూన్ 12 నుంచి 15వ తేదీ వరకు జరిగే 30వ హంగేరియన్ వాకో వరల్డ్ కప్‌కు ఎంపికైంది. కాకినాడకు చెందిన లేఖానిహారిక ఏప్రిల్ 21 నుంచి 30 వరకు కేరళలో జరిగిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ శిక్షణ శిబిరంలో ప్రతిభ చాటింది. శుక్రవారం ఆమెను కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అభినందించారు. నిహారిక చూపిన పట్టుదల, కృషి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని.. జూన్‌లో జరిగే వరల్డ్ కప్‌లో ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.


నిహారికను అభినందిస్తున్న కాకినాడ ఎస్పీ

రూపాయలు పంపి.. లక్షలు లాగేసి!

- 'అమ్మ ఒడి' పేరుతో టోకరా
- అమరావతి నుంచి ఆఫీసరును మాట్లాడుతున్నానంటూ ఫోన్లు
- ఖాతాల నుంచి సొమ్ములు మాయం
- బాధితులందరిదీ పిఠాపురం నియోజకవర్గం

పిఠాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి నుంచి ఆఫీసరును మాట్లాడుతున్నాను. మాట్లాడేది ఫలానా వారేనా, మీకు గతంలో పనిచేసిన వాలంటీరు ఎలాంటి వారు.. మీకు గతేడాది అమ్మఒడి పడలేదు. ఈ ఏడాదితో కలిపి పడాలంటే నేను చెప్పినట్టు చేయండి అంటూ వాట్సాప్ షేరింగ్, ఫోన్ పేకు మొదట రూపాయి పంపి ఆపై ఓటీపీ చెప్పించుకుని బ్యాంకు ఖాతాలు నుంచి సొమ్ములు లా గేసి టోకరా వేశాడు ఒక వ్యక్తి. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో గురు, శుక్రవారాల్లో పలువురికి ఇదే విధమైన ఫోన్లు వచ్చి రూ.2లక్షలకు పైగా మోసపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పిఠాపురం పట్టణం, మండలంలోని గోకివాడ, విరవాడ తదితర గ్రామాలు, గొల్లప్రోలు పట్టణాలకు చెందిన పలువురు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్లు వచ్చాయి. అమరావతి నుంచి ఆఫీసరును మాట్లాడుతున్నానని పరిచయం చేసుకుని, తొలుత గతంలో పనిచేసిన వలంటీర్ల పనితీరు గురించి ఆరా తీశాడు. వారితో మాట్లాడుతూనే వలంటీర్లను లైన్‌లోకి తీసుకున్నాడు. ఆపై మీకు గతేడాది అమ్మఒడి రాలేదు మీ బ్యాంకు ఖాతాలో, ఆన్‌లైన్‌లో సమస్య ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడిందంటూ చెప్పారు. (గతేడాది ఎవ్వరికి అమ్మఒడి నిప్రభుత్వం వేయలేదు). వచ్చే నెలలో మళ్లీ అమ్మఒడి పడుతుందని, మీ ఖాతాలకు రెండేళ్ల సొమ్ములు రూ.30వేలు రావాలంటే తాను చెప్పినట్టు చేయాలని సూచించాడు. ఇది నిజమేనని నమ్మి వాట్సాప్ షేరింగ్, ఫోన్ లింకింగ్ ఆప్షన్లకు ఓకే చెప్పారు. అదే సమయంలో ఫోన్లు చేసిన వారి ఫోన్‌పేకు లేకుంటే తెలిసిన వారి ఫోన్ పే ఖాతాలకు రూపాయి పంపాడు. ఇప్పుడు మీరు ఆ తర్వాత వచ్చే లింక్‌ను క్లిక్ చేసి ఓటీపీ చెప్పాలని కోరగా వారు చెప్పేశారు. ఈ విధంగా గోకివాడకు చెందిన రాంబాబు అనే వ్యక్తి ఖాతా నుంచి రూ.36వేలు, బాలాజీ నుంచి రూ.8వేలు, అంజి నుంచి రూ.5వేలతో పాటు సుమారు 24 మంది నుంచి రూ.2వేల నుంచి 40వేల వర కూ సుమారు రూ.2లక్షలకు పైగా సొమ్ములను బ్యాంకు ఖాతాలు నుంచి లాగేశాడు. ఖాతాలు నుంచి సొమ్ములు మాయం కావడంతో మోసపోయామని గుర్తించిన వారు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఆ వ్యక్తి నేరుగా అమ్మఒడి లబ్ధిదారులకే ఫోన్ చేయడం, అదే సమయంలో వలంటీర్లకు ఫోన్లు కలపడం వంటివి చేయడంతో ఇతను గత ప్రభుత్వంలో పనిచేసి ఈ వివరాలను తీసుకుని ఇప్పుడు ఫోన్ చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ వ్యవహారం పిఠాపురం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారడంతో పాటు జనసేన పార్టీ తరపున ఇటువంటి ఫోన్లకు ఎవ్వరు స్పందించవద్దంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం సాగిస్తున్నారు.

ఆలిండియా సీఎస్ఎస్ఆర్ కాంపిటేషన్‌లో
కాకినాడ ఏపీఎస్పీ సిబ్బందికి తృతీయం



సిబ్బంది నల్లబాబు, శివశంకర్‌లను అభినందిస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

సర్పవరం జంక్షన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన కొలాప్స్‌డ్ స్ట్రక్చర్ సెర్చ్ అండ్ రెస్క్యూ (సీఎస్ఎస్ఆర్) కాంపిటేషన్‌లో కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ఎస్‌డీఆర్ఎఫ్ టీమ్ తృతీయ స్థానంలో నిలిచింది. శుక్రవారం కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఎస్పీలో నిర్వహించిన అభినందన సభలో ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పి.నల్లబాబు, శివశంకర్‌లను కమాండెంట్ ముద్రగడ నాగేంద్రరావు అభినందించారు. రూ.50వేలు నగదు, మెడల్స్ అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో జరిగే పోటీల్లో మరింత ప్రతిభ చూపి ఏపీఎస్పీ బెటాలియన్‌కు పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన


పెద్దాపురంలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు


నాగమల్లిక మృతదేహం

పెద్దాపురం/గండేపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సురంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న నిండుకుండల నాగమల్లిక (23) శుక్రవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకుంది. గండేపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. రౌతులపూడి మండలం మెరకచామవరం గ్రామానికి చెందిన నాగమల్లిక యూనివర్సిటీలో వార్డెన్‌గా పనిచేస్తుంది. అదే గ్రామానికి చెందిన శెట్టిబత్తుల శివదుర్గ, ఆమె ప్రేమించుకున్నారు. కానీ శివ దుర్గ వివాహం చేసుకోవడానికి నిరాకరించినందున ఆమె మనస్తాపం చెంది తాను ఉంటున్న రూమ్‌లోనే సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మరణించిందని నాగమల్లిక తల్లి అయిన దేవుడమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శివనాగబాబు పేర్కొన్నారు. యూనివర్సిటీ యాజమాన్యం నాగమల్లిక మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రి తరలించడంతో మృతురాలి బంధువులు, దళిత సంఘాల నాయకులు అక్కడికి చేరుకుని రహదారిపై బైఠాయించారు. నాగమల్లిక మృతిపై తమకు పలు అనుమానాలు ఉన్నాయని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుని ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు. నాగమల్లిక మృతితో ఎం.చామవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నిండుకుండల రమణమ్మ, దేవుడమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు కాగా నాగమల్లిక మూడో అమ్మాయి. అక్కలిద్దరికీ పెళ్లిళ్లు చేయగా నాగమల్లిక వార్డెన్‌గా పనిచేస్తుంది. ఆమె కుటుంబం వలస కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. మూడు నెలలు క్రితం కాకినాడ వలస వెళ్లారు.

35,94,774 విద్యార్థిమిత్ర కిట్లు సిద్ధం

రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ గని

ఉప్పలగుప్తం, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు 35,94,774 డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్లు సిద్ధంగా ఉన్నట్టు రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్‌గని తెలిపారు. కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ఆయన కిట్లు పంపిణీకి నియమించిన బృందాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిట్లు పంపిణీ, కిట్లలోని ఎనిమిది యూనిట్లపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాలల వరకు విద్యార్థులకు పుస్తకాలు బరువు తగ్గించే ప్రణాళిక అమలు చేస్తున్నట్టు వివరించారు. ఆరో తరగతికి హిందీ పుస్తకం ఉండదన్నారు. 6,7 తరగతులకు లాంగ్వేజస్ ఒక పుస్తకం, నాన్‌లాంగ్వేజస్ విడివిడిగా ఉంటాయన్నారు. 1,2 తరగతులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం కలిపి ఒకే పుస్తకం ఉంటుందన్నారు. విద్యార్థిమిత్ర జిల్లా పరిశీలకుడు బీవీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలో 97,078 విద్యార్థిమిత్ర కిట్లు పంపిణీ చేస్తామన్నారు. ఏకరూప దుస్తుల కోసం వస్త్రం సరఫరా చేసి, ప్రతి జతకు కుట్టుకూలిగా రూ.200 తల్లుల ఖాతాలో జమచేస్తామన్నారు. ఎంఈవోలు కె.కిరణ్‌బాబు,సత్తి సత్యకృష్ణ పాల్గొన్నారు.

మావోయిస్టుల మృతదేహాల అప్పగింత

రంపచోడవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం శేషసాయి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు స్పెషల్ జోనల్ కమాండర్ జగన్, డిస్ట్రిక్ట్ కమాండర్ రమేష్ మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాలను వారి బంధువులకు పోలీసులు అప్పగించారు.

జయలక్ష్మి కో-ఆపరేటివ్ సొసైటీ నిందితుల
ఆస్తుల జప్తు

సుమారు రూ.7.10 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి జీవోలు జారీ

సర్పవరం జంక్షన్, మే 9 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీల ఆశ చూపించి కోట్లాది డిపాజిట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ నిందితుల ఆస్తులను అటాచ్‌మెంట్ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం రెండు జీవోలు విడుదల చేసింది. దీంతో ఇప్పటివరకు ప్రభుత్వం 14 జీవోలు జారీ చేసినట్టు అయింది. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో 1999లో ప్రధాన కార్యాలయంగా జయలక్ష్మి మ్యూచువల్లీ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీని చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్ చైర్‌పర్సన్‌గా బదిరీ విశాలాక్షి తదితర డైరెక్టర్లతో ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖ, కృష్ణా జిల్లాల్లో 29 బ్రాంచీలతో సుమారు 19 వేలమంది నుంచి సుమారు రూ.4580 కోట్లు డిపాజిట్లు సేకరించారు. బాండ్ల కాలపరిమితి దాటినా డబ్బులు చెల్లించకపోవడంతో బాధితులు ఆందోళనచేపట్టగా, 6 ఏప్రిల్ 2022న సొసైటీ చైర్మన్,వైస్ చైర్మన్, డైరెక్టర్లు బోర్డు తిప్పేసి పరారయ్యారు. ఆర్థికమోసానికి పాల్పడిన జయలక్ష్మి పాలకవర్గం సభ్యులను అరెస్ట్ చేసి న్యాయం చేయాలని బాధితులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం సహకార శాఖ ద్వారా ఈ కేసును సీబీసీఐడీకి అప్పగించింది. డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం జప్తు చేసిన ఆస్తులపై నియంత్రణను అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ కుంభకోణానికి ప్రధాన సూత్రదారులైన జయలక్ష్మి సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్లు ఇతర డైరెక్టర్లుపై కేసు నమోదు చేసిన సీబీసీఐడీ అధికారులు అరెస్ట్ చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితులకు చెందిన ఆస్తుల స్వాధీనానికి ప్రభుత్వం వేర్వేరుగా 12 జీవోలను జారీ చేసింది. సుమారు 98 ఆస్తులకు చెందిన రూ.450 కోట్ల విలువైన స్థిరాస్తులను సొసైటీ చొరవతో సీఐడీ సీజ్ చేసి కోర్టుకు అటాచ్‌మెంట్ చేసింది. శుక్రవారం నిందితుల ఆస్తులను అటాచ్‌మెంట్ చేస్తూ మరో రెండు జీవోలు విడుదల చేసింది. ఇందులో విశాఖపట్నం చంద్రంపాలెంకు చెందిన చుండూరి శివసూర్యవెంకటశ్రీనివాస్ పేరుపై శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ధర్మవరం, అనకాపల్లి జిల్లా చోడవరం, కాకినాడ రూరల్ మండలం చీడిగ, తిమ్మాపురం, కొత్తపల్లి మండలం కొమరగిరి, పొన్నాడ, పిఠాపురం, కొత్తపల్లి, సామర్లకోట మండలం కొప్పవరం, కాకినాడ అర్బన్ రామారావుపేట, మెహర్‌నగర్ పలు ప్రాంతాల్లో ఉన్న సుమారు రూ.7.10 కోట్ల ఖరీదు చేసే పలు ప్లాట్లు, స్థిరాస్తులను సీజ్ చేస్తూ ప్రభుత్వం 77 పేరుతో జీవో జారీ చేసింది. అలాగే జీవో నెం.78 పేరుతో నిందితుల నుంచి అటాచ్‌మెంట్ చేసిన ఆస్తులపై స్వాధీనం కోసం, నియంత్రణ చేస్తూ సంబంధిత కోర్టు ముందు దరఖాస్తు దాఖలుచేసేందుకు ఏపీ మంగళగిరి నేర పరిశోధనా విభాగం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కి అధికారం అప్పగిస్తూ తదుపరి చర్యలు తీసుకోవాలని, అనంతరం నివేదికను ప్రభుత్వానికి పంపాలని ఆదేశాలు జారీ చేస్తూ 78పేరుతో జీవో జారీ చేసింది. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆస్తుల స్వాధీనం, సేల్ ఆర్డర్ కోసం సత్వరమే ప్రభుత్వ, న్యాయపరమైన అనుమతులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. మరో మూడు జీవోలను కూడా సత్వరమే విడుదల చేసి, తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని వారు కోరుతున్నారు.

లక్ష్మీదేవిలంకలో చోరీ

55 గ్రాముల బంగారం, 39 తులాల వెండి మాయం


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్, పోలీసులు

ముమ్మిడివరం, మే 9 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి వెండి, బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అన్నంపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిలంకలో చోరీ జరిగింది. లక్ష్మీదేవిలంకకు చెందిన కడలి పద్మావతి బుధవారం సామర్లకోటలోని బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. అయితే బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న పద్మావతి మరిది హేమరాజు శుక్రవారం పద్మావతి ఇంటి వద్ద పెట్టిన మోటారుసైకిల్‌ను తీసుకునేందుకు వెళ్లగా తలుపుల తాళాలు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి పద్మావతికి ఫోన్ చేశాడు. ఇంటి వెనుకకు వెళ్లిచూడగా తలుపులు పెకిలించి ఉండడం, బీరువా తాళాలు తీసి ఉండడంతో విషయాన్ని పద్మావతికి చెప్పడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బీరువాలో ఉంచిన 55 గ్రాముల బంగారపు వస్తువులు, 39తులాల వెండి వస్తువులు, రూ.20వేల నగదును దొంగలు అపహరించుకుపోయినట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పద్మావతి భర్త ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉండగా పద్మావతి తల్లి, కుమారుడు, అక్క కుమార్తె ఇంట్లో ఉంటున్నారు. ప్రస్తుతం వారంతా బంధువుల ఇంటికి ఊరు వెళ్లిన సమయంలో చోరీ జరిగింది. సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి వెళ్లి చోరీకి సంబంధించిన ఆధారాలు సేకరించారు. క్లూస్‌టీం బృందం వచ్చి ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేపట్టారు.

అల్లుకుంది ఆపద!

కాకినాడలోని కొండయ్యపాలెం బ్రిడ్జి వద్ద అపార్టమెంట్ల సమీపంలో విద్యుత్ స్తంభానికి ఓ మొక్క అల్లుకుంది. అయితే వర్షాలు కురిస్తే విద్యుత్ ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు.

- ఫొటోగ్రాఫర్, కాకినాడ







వసంతకాల వేళ.. అదిరేల

వసంతకాలం వచ్చిందంటే చెట్లు చిగురిస్తాయి, పుష్పాలు విచ్చుకుని ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుతాయి. రాజమహేంద్రవరం టీనగర్ లో గోదావరి బండ్ వైపు రేల చెట్లు పుష్పించాయి. చూడముచ్చటగా పసుపు పందిరి మాదిరిగా కనిపిస్తున్నాయి. అటుగా వెళ్లేవారిని ఆకర్షిస్తున్నాయి.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

మిగులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

అధికారులతో ఎమ్మెల్యే బత్తుల


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం(కోరుకొండ), మే 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రైతుల వద్ద ఉన్న మిగులు ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. కోరుకొండ ఎంపీడీవో కార్యాలయంలో మూడు మండలాలకు చెందిన వ్యవసాయ శాఖాధికారులతో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతుల వద్ద ఇంకా మిగిలిపోయిన ధాన్యం వివరాలు తక్షణమే సేకరించి కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రస్తుత యాంత్రీకరణ సాగులో రైతులకు అవసరమైన యంత్ర పరికరాల పంపిణీ గురించి అధికారులతో సమీక్షించారు. వీలైనంత త్వరగా కోరుకొండలో నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేసి,యంత్ర పరికరాలు పంపిణీ చేసే యోజనలో ఉన్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. అధికారులంతా అన్నదాతలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బత్తిన అశోక్‌కుమార్, వ్యవసాయశాఖ ఏడీ మల్లికార్జునరావు, రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల వ్యవసాయాధికారులు షేక్ ఇమామి ఖాసిం, గౌరి, రామతులసి పాల్గొన్నారు.

ప్రజావసరాలు తీర్చడమే మా కర్తవ్యం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలు తీర్చడమే తమ కర్తవ్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక దానవాయిపేట గాంధీ పార్కులో రూ.4 లక్షలతో భవాని చారిటబుల్ ట్రస్టు, పరమేసు బయోటెక్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి నేపథ్యంలో ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో మరో రెండు ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పార్కు అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతోందని ఎమ్మెల్యే అన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వితంశెట్టి ప్రసాద్

జంతు హింస నివారణ జిల్లా సొసైటీ కార్య నిర్వాహక కార్యదర్శిగా నియమితులైన వితంశెట్టి కిరణ్ ప్రసాద్.. ఎమ్మెల్యే వాసును ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కు అభినందనలు తెలిపి పదవికి న్యాయం చేయాలన్నారు. సమాజంలో చేస్తున్న సేవలను గుర్తించి ఇచ్చిన పదికి వన్నెతీసుకువస్తానని ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు.

జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలి

ఎక్లాప్ శిక్షణలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి


రాజానగరంలో శిక్షణలో మాట్లాడుతున్న పీడీ మూర్తి

రాజానగరం, మే 9 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు తమ జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్‌వీఎస్ మూర్తి ఆకాంక్షించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్లో ఎక్లాప్ (యాన్యువల్ క్రెడిట్ లైవ్‌లీ హుడ్ ప్లాన్) వార్షిక రుణ జీవనోపాధులు ప్రణాళిక, ఎంటీకే 2.0పై ఏపీఎం, సీసీలు, వీవోఏలకు శుక్రవారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను రూపొందిస్తోందని, వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. మహిళలు స్వశక్తితో పరిశ్ర మలు స్థాపించి, ఆర్థికంగా బలోపేతం చేసేం దుకు అవసరైన రుణ సౌకర్యాన్ని బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించే దిశగా ప్రభు త్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమం లో డీపీఎంలు సంపత్, శ్రీనివాస్, రాజానగరం, సీతానగరం, కోరుకొండ, గోకవరం, రాజమండ్రి రూరల్, కడియం, రంగంపేట, అనపర్తి, బిక్కవోలు మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

మావోయిస్టుల సమస్యను రాజకీయ అంశంగా గుర్తించాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ

రాజమహేంద్రవరం అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల సమస్యను రాజకీయ అంశంగా గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ దండకారణ్య ప్రాంతంలో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టుల అణచివేత పేరుతో అమాయక ఆదివాసీలపై జరుగుతున్న దాడులు ఆందోళనకరమని అన్నారు. భారతదేశ త్రివిధ దళాలు పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులపై జరుపుతున్న దాడులు హర్షణీయమన్నారు. ప్రపంచ చరిత్రలో రాజధాని ప్రారంభమైన తర్వాత మళ్లీ పునఃప్రారంభించడం ఎక్కడా చూడలేదని, ఆ ఘనత మన ప్రధానికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మధు తదితరులు పాల్గొన్నారు.

12న అరుణోదయ 50 వసంతాల ముగింపు సభ

ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్


సింగంపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రమేష్

రంగంపేట, మే 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న జరిగే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల ముగింపు సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని సింగంపల్లిలో సీపీ రెడ్డి నగరంలో అరుణోదయ 50 వసంతాల ముగింపు సభల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 12న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే 50 వసంతాల సభలకు కార్మికులు, కర్షకులు, విద్యార్థి మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, కడితి సతీష్, చెక్క సత్తిబాబు, గొల్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు సముచిత స్థానం: నల్లమిల్లి

అనపర్తి, మే 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కూటమి అధికారంలోకి వచ్చేందుకు సోషల్ మీడియా చేసిన కృషి ఎనలేనిదని, దానికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో సోషల్ మీడియా నియోజకవర్గ అధ్యక్షుడు కోనాల వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ టీమ్ ముందుకు సాగుతోందన్నారు. గ్రామాల్లో పార్టీ నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి ఎన్నో రకాల అసత్య పోస్టులు పెట్టారని ఆ పోస్టులను ధీటుగా ఎదుర్కొన గలిగామంటే అది సోషల్ మీడియా గొప్పతనమేనన్నారు. సమావేశంలో కూటమి సీనియర్ నాయకులు, నియోజకవర్గ సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

'గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేస్తాం'

గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ కోటేశ్వరరావు


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న కోటేశ్వరరావు

కొవ్వూరు, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేస్తా మని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయాన్ని పరిశీలించారు. దీనిలో భాగంగా అన్ని విభాగాలను తనిఖీచేశారు. పాఠకులకు గ్రంథాలయం నుంచి అందుతున్న సేవల గురించి అడిగితెలుసుకున్నారు. గోనుగుంట్ల మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మం త్రిగా ఉన్న సందర్భంలో ప్రారంభించిన గ్రం థాలయమన్నారు. ఇటీవల రాజ్యసభ సభ్యులు వి. విజయేంద్రప్రసాద్ అందించిన నిధులతో గ్రంథాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న రిఫరెన్స్ విభాగం భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జీవీవీఎన్. త్రినాథ్, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఓపెన్ ఫోరంలో కమిషనర్ కేతన్ గార్గ్


నగరంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఓపెన్‌ఫోరంలో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్), బిల్డింగ్ పెనలైజేషన్ స్కీం(బీపీఎస్)లపై వచ్చిన అర్జీలపై ఆరా తీసి చర్చించారు. అనంతరం టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్షించారు. అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలు ప్రతిరోజు టెలీకాన్ఫరెన్స్‌లు తప్పనిసరిగా అనుసరించాలని, అప్పుడే చేసే పనిలో మంచిఫలితాలు వస్తాయన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్స్ ఎక్కడా పెండింగ్ ఉండకూడదని సూచించారు. ప్లానింగ్ సెక్రటరీలు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పరిశీలన చేయాలన్నారు. నగరంలో అక్రమణలు తొలగింపు నిత్యం జరగాలని లేకపోతే నగరంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. అలాగే ఏదైనా ప్రాంతంలో అనధికార ఫ్లెక్సీలు, బోర్డులు గుర్తిస్తే తక్షణమే తొలగించాలన్నారు. ప్లానింగ్ సెక్రటరీలు విధుల్లో ఏమాత్రం అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

స్థానిక ఏవీఏ రోడ్డు, రామాలయం సెంటర్, జేఎన్ రోడ్డు ప్రాంతాల్లో కమిషనర్ కేతన్ గార్గ్ పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్మికులతో మాట్లాడి ప్రతి రోజు చెత్త తరలింపుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలు, రహదారులను శుభ్రంగా ఉంచాలని, తడి, పొడి చెత్తసేకరణను మరింత మెరుగ్గా నిర్వహించాలని చెప్పారు. కాలువల పూడిక తీత, సిల్ట్ ఎత్తివేత పనులు క్రమం తప్పకుండా జరగాలని అలాగే ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ప్రజా మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలన్నారు. పరిసరాలను పరిశుభ్రత ప్రతి ఒక్కరిబాధ్యత అని కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు.

జవాన్లకు మద్దతుగా నిలవాలి

- ఎమ్మెల్యే నల్లమిల్లి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర
- అనపర్తిలో సంఘీభావ ర్యాలీ


అనపర్తిలో నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి, పిక్కి నాగేంద్ర

అనపర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్మిన వేళ పోరాటం చేస్తున్న సైనికులకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైనికులకు సంఘీభావం ప్రకటిస్తూ శుక్రవారం అనపర్తిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా దేవీచౌక్ నుంచి గాంధీబొమ్మ వరకు రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలు చేతబూని ర్యాలీ చేశారు. అనంతరం గాంధిబొమ్మ వద్ద జరిగిన సభలో దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళీనాయక్‌కు ఘనంగా నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదంపై మన సైనికులు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం మన సైనికుల అంకిత భావానికి నిదర్శనమన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మన కోసం పోరాటం చేస్తున్న సైనికుల కుటుంబాలకు బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, సీఐ సుమంత్ పాల్గొన్నారు.

మురళీనాయక్ త్యాగాన్ని దేశం మరువదు: ఎంపీ

రాజమహేంద్రవరం అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన మురళీ నాయక్ కుటుంబానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయక్ తల్లిదండ్రులను ఫోన్‌లో పరామర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ మురళీనాయక్ త్యాగాన్ని దేశం మరవదని, సరిహద్దుల్లో శత్రుమూకలతో పోరాడి ప్రాణాలు కోల్పోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. నాయక్ ఇంటికి సత్యసాయి జిల్లా బీజేపీ నాయకులను పంపించి ధైర్యం చెప్పడం జరిగిందని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

అందరూ అప్రమత్తంగా ఉండండి

యుద్ధ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన


రంగంపేటలో జాగ్రత్తలు వివరిస్తున్న ఎస్ఐ శివప్రసాద్

రంగంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్మిన వేళ దేశంలో ఎక్కడైనా బాంబుల దాడి జరిగితే తీసుకోవల్సిన జాగ్రత్తలపై శుక్రవారం రంగంపేట సచివాలయం వద్ద తహశీల్దార్ కోసు అనసూయ, ఎంపీడీవో సాయిబాబు, ఎస్.ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కలిగించారు. శత్రుల దాడి నుంచి ప్రజలు సురక్షితంగా బయటపడడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలను ఎస్.ఐ శివప్రసాద్ వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రద్దీ ప్రదేశాలకు అత్యవసరమైతేనే వెళ్లాలని, దేశ సరిహద్దు ప్రాంతాలకు సందర్శనకు వెళ్లే వారు వాయిదా వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీరామ మూర్తి, కూటమి నాయకులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కడియం: కడియంలో వైద్యఆరోగ్యశాఖ సిబ్బందికి మాక్ డ్రిల్ నిర్వహించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ జి.మాధురి మాట్లాడుతూ ప్రస్తుత యుద్ధ వాతావరణంలో ఆరోగ్య రీత్యా ఎటువంటి పరిస్థితులు వచ్చినా వైద్యసిబ్బంది అందుబాటులోను, అప్రమత్తంగాను ఉండాలన్నారు. అత్యవసర వైద్య సేవలందించాలని, అనంతరం సమీప ఆస్పత్రికి తరలించాలన్నారు. అవసరమైన మందులు, పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే గుండెకు భరోసా (స్టెమీ) కార్యక్రమంలో భాగంగా గుండెపోటు లక్షణాలు, తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న, డాక్టర్ ఎల్.మోహనవంశీ, డాక్టర్ ఎస్.నాగసాయిమౌర్య, విల్సన్‌పాల్, మురళి, రవికుమార్, మూర్తి, హెల్త్‌అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


కడియంలో మాట్లాడుతున్న డాక్టర్ మాధురి

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

- పాలచర్ల పీహెచ్‌సీ డాక్టర్ బెనడిక్ట్
- పలుచోట్ల ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్


కంబాలపేటలో గర్భిణులకు ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

దివాన్‌చెరువు, మే 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ బెనడిక్ట్ చెప్పారు. పాలచర్లలోని ప్రాథమిక ఆర్యో కేంద్రం(పీహెచ్‌సీ)లో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు శుక్రవారం వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారికి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 37 మందికి వైద్యపరీక్షలు చేశామని, వారిలో ఏడుగురుని హైరిస్క్ కేసులు గుర్తించినట్టు చెప్పారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు, వారివెంట వచ్చిన సహాయకులకు మధ్యాహ్న భోజనం సమకూర్చిన హౌసింగ్‌బోర్డులోని సత్యసాయి ఫౌండేషన్‌కు డాక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

సీతానగరం: సీతానగరం పీహెచ్‌సీలో డాక్టర్ ఏవీకె చైతన్య 48 మంది గర్భిణులను పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణి నెలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకవాలని చెప్పారు. వడదెబ్బలకు గురికాకుండా చల్లని ప్రదేశాల్లో ఉండి ద్రవ పదార్థాలు తరచుగా తీసుకోవాలని తద్వారా తల్లి, కడుపులోని బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు.కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ కె.సుధాకర్, స్టాఫ్ నర్సు నాగమణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక కంబాలపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో గర్భిణులకు జిల్లా కమ్యూనిటీ పారా మెడికల్ అండ్ హెల్త్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ మల్లాది అనూహ్య పరీక్షలు చేశారు. గ్లూకోస్-డి, బిస్కట్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎమ్వీఆర్ మూర్తి, బళ్లా శ్రీనివాసరావు, పి.దేవానందం, పి.చిన్ని, రహ్మాన్‌ఖాన్, మట్టా రమేష్,జి.వెంకటేష్ పాల్గొన్నారు.


సీతానగరం పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్

అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి విషయంలో అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని అధికారులు ప్రభుత్వం అమలు చేసే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అభివృద్ధి విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించినా సహించబోమని హెచ్చరించారు. గత ప్రభుత్వం 11,513 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే... ఈ ఏడాది ప్రభుత్వం 16 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని, మరో 2,500 మెట్రిక్ టన్నులు కొనుగోలుకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. రైతులకు ఏ దశలోనూ ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఎన్ఆర్‌జీ ఎస్ నిధులు రూ. 56 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కుట్టుమిషన్ల శిక్షణలో పాల్గొన్న మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లా డుతూ మండలంలో రూ. 24 లక్షలతో తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా మోటార్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత పరిస్థితులు కుట్టుమిషన్లకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. దేవరపల్లిలో 144 మంది రెండు బ్యాచ్‌లుగా శిక్షణలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఎంపీడీవో ఎస్. వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆంద్రూ అనిల్, నాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, పలు శాఖల అధికారులు, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజలకు త్వరలో సన్నబియ్యం

రాజమహేంద్రవరం సిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం త్వరలో ప్రజలకు సన్నబియ్యం పథకం అందించబోతుందని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 12న ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారన్నారు. తొలుత రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు, సంక్షేమ వసతి గృహాలకు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

18న పాటి మీద పందుళ్లమ్మ జాతర



రాజానగరం(కోరుకొండ), మే 9(ఆంధ్రజ్యోతి): శ్రీరంగపట్నం-అచ్యుతాపురం రహదారిలో ఉన్న శ్రీ పాటి మీద పందుళ్లమ్మ జాతరను ఈ నెల 18న నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ శుక్రవారం తెలిపింది. 13న గరగలు తీస్తారని, 18న సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా కాల్పులు, నడుమ అమ్మవారి జాతర వైభవంగా జరుగుతుందన్నారు. అనంతరం అన్న సమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణంపై కమిషనర్‌కు ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, మే9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పశువుల ఆసుపత్రి వద్ద గౌతమి సూపర్ బజార్ సొసైటీకి చెందిన స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని దానిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ మునిసిపల్ విభాగం చైర్మన్ మజ్జి అప్పారావు కమిషనర్ కేతన్ గార్గ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు.

వలీబాషా కుటుంబానికి రక్షణ కల్పించండి

వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఆరీఫ్

రాజమహేంద్రవరం సిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): నిడదవోలు పోక్సో కేసులో రాజీ పడిన మహిళ తండ్రి వలిబాషాను అత్యంత కిరాతకంగా హత్యచేసిన నిందితుడు పిరంగుల అనిల్‌ను కఠినంగా శిక్షించాలని జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఎండీ ఆరీఫ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిడదవోలు సీఐను కలిసి వినతిపత్రం అందించామని తెలిపారు. పోక్సో కేసులో జైలుకు వెళ్లి వచ్చిన పిరంగుల అనిల్ తనకు శిక్షపడుతుందని కనీస భయం లేకుండా దారుణంగా హత్య చేసిన నిందితుడ్ని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు. దీనిపై స్థానిక ముస్లిం పెద్దలతో కలిసి తహశీల్దార్, సీఐలతో చర్చించినట్టు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరామని ఆరీఫ్ పేర్కొన్నారు.

లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతి

పెరవలి, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంకా లక్ష టన్నుల మేర ధాన్యం కొనడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ రాధిక తెలిపారు. శుక్రవారం పెరవలి, తదితర రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు రైతులకు రూ. 550 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని, ఇంకా వంద కోట్ల వరకు బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. ఈమెతోపాటు వ్యవసాయాధికారి మేరీ కిరణ్, ఆర్ఐ పావని, తదితరులు ఉన్నారు.

జంతు హింస నివారణ సంఘం జిల్లా సభ్యుడిగా బలుసు

నల్లజర్ల, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లా జంతు హింస నివారణ సంఘ సభ్యుడిగా ముసుళ్లకుంట మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు బలుసు గంగ రాజును ఎంపిక చేసినట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను ఆయన శుక్రవారం ముసుళ్లకుంటలో గంగరాజుకు అందించారు. తనకు ఈ పదవి ఇవ్వడంపై గంగరాజు ఎమ్మెల్యేకి, పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్వోబీ పనులు త్వరగా పూర్తిచేయాలి

నిడదవోలు, మే 9(ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలో జరుగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులతో మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలన్నారు. ఆయన వెంట రోడ్లు భవనాల శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

శివపార్వతుల రథోత్సవం

తాళ్లపూడి, మే 9(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడిలో పార్వతీ సహిత ఉమా పరమేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు జంధ్యాల గంగాధర శర్మ, అశ్వనీదత్ మాట్లాడుతూ గురువారం రాత్రి శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. ఇందులో పరస శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నట్టు చెప్పారు.

దేశ సరిహద్దుల్లో..



మా కుమారుడు దేశ రక్షణలో భాగస్వామి కావడం ఆనందంగా ఉంది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో దేశ రక్షణకై పోరాడడం మామూలు విషయం కాదు.. ప్రాణాలెదురొడ్డి పోరాడాలి. మనం ఇక్కడ భయపడితే వారు అక్కడ భయపడతారు. అలా కాదు.. మనం ధైర్యంగా ఉండాలి.. వారిలో ధైర్యాన్ని నింపాలి.. ఇదీ అల్లవరం మండలం ఈటీవారి గ్రామానికి చెందిన యీటి చిన శివకుమార్ తల్లిదండ్రులు గోపాలరావు, కాశీరామేశ్వరి స్పందన. మా రెండో అబ్బాయి యీటి చినశివకుమార్ 20 ఏళ్లగా ఆర్మీ ఎయిడ్ డిఫెన్స్ విభాగంలో విధుల్లో ఉంటున్నాడు. ప్రస్తుతం భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధం నెలకొన్న నేపథ్యంలో చిన శివకుమార్ జమ్మూ బోర్డర్ సమీపాన ఉద్దంపూర్‌లో సైనిక విధుల్లో ఉన్నాడని వారు తెలిపారు. కుటుంబ పరంగా ఆందోళన కలిగిస్తున్నా, దేశం తరపున పోరాడుతున్నందుకు గర్వంగా ఉందని తెలిపారు.



పవన్.. పెద్ద మనసు

- తన జీతం.. వారి జీవితాలకు..
- 42 మంది పిల్లలకు నెలకు రూ.5 వేల చొప్పున పంపిణీ
- ఆ వృద్ధురాలితో కలసి భోజనం

నాకు దాచుకోవడం తెలియదు.. పంచిపెట్టడం తప్ప.. ఎన్నికలకు ముందు ఒక బహిరంగ సభలో పవన్ చెప్పిన మాట ఇది.. నిజమే ఆయనకు దాచుకోవడం తెలియదు.. అందుకే పేదలను చూస్తే కరిగిపోతారు.. పవర్ స్టార్ పవన్‌కల్యాణ్ ఇప్పుడు మరో మంచి పనికి శ్రీకారం చుట్టారు. డిప్యూటీ సీఎం పదవి ద్వారా ప్రతి నెలా వచ్చే జీతం మొత్తం పిఠాపురం నియోజకవర్గంలో తల్లిదండ్రులు లేని 42 మంది చిన్నారులకు రూ.5 వేలు చొప్పన పంపిణీ చేయాలని తలంచారు.. దీనిలో భాగంగా శుక్రవారం చిన్నారులను మంగళగిరి రప్పించుకుని రూ.5 వేల చొప్పున అందజేశారు.. వచ్చే నెల నుంచి ఇంటి వద్దే పంపిణీ చేస్తారని ప్రకటించారు.. తనపై అభిమానం పెంచుకున్న ఒక 95 ఏళ్ల వృద్ధురాలిని ఇంటికి తీసుకెళ్లారు.. నీకేం కావాలవ్వా అని అడిగారు. నీతో భోజనం చేయాలని ఉంది బాబూ అనగానే ఆమెతో కలిసి భోజనం చేశారు.. చీర పెట్టి.. రూ. లక్ష ఇచ్చి కారులో ఇంటికి పంపారు.. - మెయిన్‌లో





హై..అలర్ట్!

భద్రత.. కట్టుదిట్టం

భారత్ - పాకిస్తాన్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో రోజురోజుకు పరిణామాలు మారుతున్నాయి. దేశవ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతాల్లో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. పోర్టులు, నౌకాశ్రయాల్లో భద్రత పెంచింది. సముద్ర జలాల ద్వారా ముష్కరులు వచ్చే అవకాశం ఉందన్న హెచ్చరికలతో తీర ప్రాంతాల్లో భద్రతను రెండంచెల స్థాయికి పెంచారు. జిల్లా పోలీసులు, కోస్టు గార్డ్ సిబ్బంది, కస్టమ్స్, పోర్టు అధికారులు అప్రమత్తమై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్లతో నిరంతరం నిఘాను పెంచుతూ తీరంలోని కదలికలను పరిశీలిస్తున్నారు. షిప్‌యార్డులు, సీ పోర్టుల్లో ఉన్న విదేశీ నౌకలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మరోవైపు మధురపూడి విమానాశ్రయం, రైల్వే స్టేషన్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.



- తీరాన ముమ్మర గస్తీ
- కోస్ట్‌గార్డ్, మెరైన్ బృందాల తనిఖీ
- చమురు నిక్షేపాలకు ప్రత్యేక రక్షణ
- విమానాశ్రయంలో రెడ్ అలర్ట్
- 800 ఏపీఎస్‌పీఎఫ్ సిబ్బంది
- 3 రోజులుగా సాగుతున్న మాక్‌డ్రిల్

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశ సంపదలో కీలకంగా ఉండే కృష్ణా గోదావరి బేసిన్ పరిధిలోని చమురు, సహజ వాయువు క్షేత్రాల వద్ద హైఅలర్ట్ ప్రకటించారు. తీర ప్రాంతం వెంబడి ఉన్న అపార చమురు నిక్షేపాలు కలిగిన ప్లాంట్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. శాటిలైట్ ద్వారా నిఘా పెంచారు. సముద్రం వెంబడి కోస్టుగార్డు, మెరైన్ పోలీసుల గస్తీ నౌకలు పర్యవేక్షిస్తున్నాయి. గత మూడు రోజులుగా కోనసీమలోని సముద్ర తీరం వెంబడి ఉన్న చమురు, గ్యాస్ నిక్షేపాల కేంద్రాల వద్ద సీఐఎస్ఎఫ్, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నారు. అనివార్య పరిస్థితుల్లో సైరన్ వినిపిస్తే ప్రజలు ఎలా స్పందించాలి అనే దానిపై కూడా వారు స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. రహదారులపై అర్ధరాత్రుళ్లు తనిఖీలు చేస్తున్నారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. ఎక్కడి నుంచి వస్తున్నారు? ఎక్కడికి వెళుతున్నారు? వంటి విషయాలపై ఆరా తీస్తున్నారు. మొత్తంగా కోస్తా తీరంలో బలగాలన్నీ అప్రమత్తమయ్యాయి.

- (అమలాపురం/ కాకినాడ/ రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తీరాన నిఘా...

కోనసీమ జిల్లా పరిధిలోని అంతర్వేది నుంచి ఐ.పోలవరం మండలం హోప్‌ఐలాండ్ వరకు ఉన్న సముద్ర తీరం వెంబడి అపార చమురు, సహజ వాయువుల నిక్షేప కేంద్రాలు ఉన్నాయి. సముద్రపు లోతు జలాల్లో బావుల ద్వారా ఉత్పత్తి అయ్యే గ్యాస్, ఆయిల్‌ను ప్లాంట్ల ద్వారా శుద్ధిచేసి విశాఖ లేదా ఇతర రాష్ట్రాలకు తరలించడం ద్వారా వేల కోట్ల ఆదాయాన్ని ఆ సంస్థలు ఆర్జిస్తున్నాయి. జిల్లా పరిధిలోని రిలయన్స్, జీఎస్‌పీఎస్, ఎస్.యానాంలోని వేదాంత, ఓడలరేవులోని ఓఎన్జీసీ ప్లాంటు, కేశనపల్లి, కరవాక ప్రాంతాల్లో ఉన్న ప్లాంట్లతో పాటు అత్యంత కీలకంగా ఉండే నగరంలోని జీసీఎస్‌లతో పాటు కోనసీమవ్యాప్తంగా 30కు పైగా ప్రాంతాల్లో చమురు, సహజవాయువుల అన్వేషణ కేంద్రాలు ఉన్నాయి. సీఎస్ఎఫ్, అగ్నిమాపక, పోలీస్‌తో పాటు స్థానికంగా ఉండే వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తూ ఆయా ప్రాంతాల్లోని ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. అగ్ని ప్రమాదాలు, పేలుళ్ల, అనుమానాస్పద వస్తువులు కనిపించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, మెరైన్ పోలీసులు, వేదాంత సిబ్బంది స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాంట్ల పరిసరాల్లో ప్రజల కదలికలపై నిఘా ఉంచాల్సిందిగా సూచించారు. చమురు క్షేత్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఇతర వ్యక్తుల సంచారంపై నిఘా ఉంచాలని, సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, వారి కదలికలపై కూడా నిఘాను పటిష్ఠం చేయాల్సిందిగా సూచించారు. సముద్రపులోతు జలాల్లో ఉన్న వివిధ సంస్థలకు చెందిన ఆఫ్‌షోర్ ప్లాట్‌ఫారాల వద్దకు నౌకలు, భారీ బోట్‌లు వంటివి ప్రయాణించకుండా కోస్ట్‌గార్డు బృందాలు నిఘా ఉంచాయి. రిలయన్స్, గుజరాత్ పెట్రోలియం, ఓఎన్జీసీ సంస్థలతోపాటు ఇతర ప్రైవేటు సంస్థలకు చెందిన ప్లాట్‌ఫారాల ద్వారా చమురు, సహజవాయువుల అన్వేషణ జరుగుతోంది. మరో వైపు కాకినాడ యాంకరేజ్, డీప్‌వాటర్ పోర్టులో భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. కేసీపీఎల్‌లో కూడా వచ్చే, వెళ్లే షిప్‌లను పరిశీలిస్తున్నారు. సముద్రంలో కేజీ బేసిన్ చమురు క్షేత్రాలు సమీపంలోకి ఎవరూ రాకుండా ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. సీకోస్టల్‌లో ఎక్కువగా కర్మాగారాలు, ఆయిల్ రిఫైనరీలు అధికంగా ఉన్న నేపథ్యంలో స్థానిక సెక్యూరిటీ విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు తీర ప్రాంతంలో పెట్రోలియం స్టోరేజ్ కేంద్రాలు, కర్మాగారాల్లో భద్రతా సిబ్బందిని జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తం చేసింది. ఐవోసీఎల్, బీపీసీఎల్,హెచ్‌పీసీఎల్ వంటి పెట్రోలియం స్టోరేజ్ కేంద్రాలు, కార్మాగారాల్లో ఇతరులను అనుమతించొద్దని భద్రత సిబ్బందికి హెచ్చరికలు జారీచేశారు. అలాగే బాంబ్ స్క్వాడ్స్, డ్రోన్ బృందాలు, కోస్ట్ గార్డ్స్ కేఎస్‌పీఎల్ సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు.

విమానాశ్రయంలో అణువణువు తనిఖీలు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక రక్షక దళం(ఏపీఎస్‌పీఎఫ్) అప్రమత్తమైంది.కమాండెంట్ కేఎన్ రావు స్వీయ పర్యవేక్షణలో భద్రత కట్టుదిట్టం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని అన్నవరం దేవస్థానం, కాకినాడ రిలయన్స్ఓఎన్‌జీసీ రిగ్‌లు, యాంకరేజీ పోర్టు, రాజమండ్రి ఓఎన్‌జీసీ బేస్ పరిధిలోని కోనసీమ జిల్లాలోని కృష్ణా-గోదావరి బేసిన్ బావులు, రాజమహేంద్రవరం విమానాశ్రయం, బ్యాంకు చెస్ట్‌లకు ఏపీ ఎస్‌పీఎఫ్ సుమారు 800 మంది సుశిక్షితులైన పోలీసులతో భద్రత కల్పిస్తోంది. కోనసీమలోని గ్యాస్ పైపులైన్లను నిరంతరంగా పహారా కాస్తున్నారు. రాజమండ్రి ఎయిర్ పోర్టులో రెండంచెల భద్రత ఏర్పాటు చేశారు. వీవీఐపీ, వీఐపీ వంటి హోదాలతో సంబంధం లేకుండా ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అన్నిచోట్లా నిఘా ముమ్మరం చేశారు. మెటల్, లగేజీ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. సందర్శకులను ఇప్పటికే నిషేధించారు. రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో స్వీయ రక్షణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ), సిబ్బంది ఎప్పుడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఎలా స్పందించాలనే దానిపై అవగాహన కల్పించారు.



ఎస్.యానాంలో వేదాంత ప్లాంట్ వద్ద స్థానికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రశాంతకుమార్



కాకినాడలోని పెట్రోలియం స్టోరేజ్ కేంద్రాలు, కర్మాగారాల్లో భద్రత సిబ్బందిని అప్రమత్తం చేస్తున్న పోలీసులు

మేం సిద్ధంగా ఉన్నాం..



ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ఆయుధ సంపత్తితో సిద్ధంగా ఉన్నాం. పర్యవేక్షణ అధికారులు నిరంతరం విధుల్లోనే ఉంటున్నారు. సిబ్బందికి తరచుగా ఆయా ప్రదేశాల భద్రత, ప్రజల రక్షణపై సూచనలు చేస్తున్నాం. యుద్ధం మన వరకూ వచ్చినా ప్రాణాలొడ్డి పోరాడతాం.

- కేఎన్ రావు, కమాండెంట్, ఏపీ ఎస్‌పీఎఫ్

సేకరించిన ధాన్యం 2.86 లక్షల టన్నులు

జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా అంచనా వేశామని జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం సేకరణలోని పరిస్థితులను శుక్రవారం నాటికి వివరించారు.ఇప్పటి వరకూ 39,856 కూపన్లు జనరేట్ చేసి 24,798 మంది రైతుల నుంచి 2,86,684.840 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. 31,582 ఎఫ్‌టీవోలకు రూ.550 కోట్ల 26 లక్షలు ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. 62 లక్షల గోనె సంచులు రైతులు విని యోగించారన్నారు.ప్రభుత్వ నిర్ణయం ప్రకారం కామన్ వెరైటీ క్వింటా రూ.2300, గ్రేడ్-ఏ క్వింటా రూ.2320 చెల్లించడం జరుగుతుందన్నారు. 2833 వాహనాలకు జీపీఎస్ అమర్చి ధాన్యం ర వాణాకు ఉపయోగించామన్నారు.సేక ర ణ లక్ష్యం పెంచడం వల్ల ఇప్పటి వరకూ 3302 మంది రైతులు లబ్ధి పొందారన్నారు.

గోదావరి తీర ప్రాంతాల అభివృద్ధికి కమిటీ

రుడా వైస్ చైర్మన్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరంసిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): గోదావరి పరిసర ప్రాంతాల అభివృద్ధి,సుందరీకరణ తదితర పనుల పరిశీలనకు కమిటీ ఏర్పాటు చేశామని రుడా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్ తెలిపారు. రుడా కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్షించారు. రుడా అథారిటీ పరిధిలో అర్బన్ లోకల్ బాడీస్, పంచాయతీల నుంచి వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనను పరిశీలించేందుకు కమిటీ ఏర్పాటు చేశామన్నారు. రైతులు ,ఇతర ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూసమీకరణ పథకం ద్వారా భూమిని సేకరించి రెసిడెన్షియల్ లేఅవుట్లు అభివృద్ధి ,హెల్త్ హబ్స్, టూరిజం ప్రాజెక్టులను చేపట్టడంపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో రుడా సెక్రటరీ ఎంవీఆర్ సాయిబాబా,చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జీవీఎస్ఎన్.మూర్తి ,ఈఈ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం

- నిడదవోలులో మెగా జాబ్ మేళా
- 1038 మందికి ఉద్యోగాలు
- త్వరలో టూరిజం జాబ్‌మేళా
- మంత్రి కందుల దుర్గేష్



నియామకపత్రాలతో యువతీయువకులు..



మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, మే 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫి శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలోని వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వికాస జేకేసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను మంత్రి దుర్గేష్ జ్యోతి ప్రారంభించి మాట్లాడారు. జాబ్ మేళాకు సుమారు 42 కంపెనీలు హాజరయ్యాయని ఆయా కంపెనీల్లో రెండు వేలకు పైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు.ఈ జాబ్ మేళాలో ఐటీ రంగానికి చెందిన కంపెనీలు అధికంగా వచ్చాయని..త్వరలో నిర్వహించే మరో జాబ్ మేళాలో టూరిజం, అతిథ్య రంగాలకు సంబం ధించిన కంపెనీలను ఆహ్వానిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లా డుతూ కూటమి ప్రభుత్వంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించి తీరుతామన్నారు. అనంతరం జాబ్ మేళాలో కార్పోరేట్ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 2386 మంది హాజరుకాగా 1038 మంది ఉద్యోగాలు సాధించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వికాస పీడీ కె.లచ్చారావు,జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి మురళి, కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ రుద్ర, డాక్టర్ కె.జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

పిల్లలు తప్పిపోవడం ఆందోళనకరం

న్యాయవిజ్ఞాన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, మే 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర అంశాలపై సంబంధిత అధికారులతో డీఎల్ఎస్ఏలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో స్నేహాలు పిల్లల అక్రమ రవాణాకు ఊతమిస్తున్నాయన్నారు. కుటుంబీకుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటే ఇలాంటి నేరాలకు అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. తప్పిపోయిన పిల్లల ఆచూకీ అంత సులభంగా లభించదని,వారి పరిస్థితి ఆందోళనకరంగా మారుతుందన్నారు.నల్సా వారి 'అక్రమ రవాణా బాధితులు, వాణిజ్య పరమైన లైంగిక దోపిడీ బాధితుల పథకం-2015' ద్వారా అందిస్తున్న న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. అలాంటి కేసుల్లో ఉచిత న్యాయ సహాయం కోసం డీఎల్ఎస్ఏని సంప్రదించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, డీఎస్ ఈవో వాసుదేవరావు,అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్ఎం వలీ తదితరులు పాల్గొన్నారు

అకాల కష్టం!

పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో కుమ్మేసిన వాన

పెరవలి/ఉండ్రాజవరం,మే 9(ఆంధ్రజ్యోతి): అకాలనష్టం.. అన్నదాతను నిండా ముంచేసింది. ఎప్పుడు ఎండ వస్తుందో..ఎప్పుడు వానొస్తుందో తెలియడం లేదు.. శుక్రవారమే ఉదయం నుంచి భానుడు సుర్రుమనిపించాడు..కాసేపటికే మబ్బువేసింది..అంతే నిమిషాల్లో వరుణుడు వచ్చేశాడు.. పెరవలి, ఉండ్రా జవరం మండలాల్లో సుమారు గంట న్నర సేపు దంచికొట్టాడు.దీంతో మురుగు డ్రెయిన్‌లు పొంగి ప్రవహించాయి.రోడ్లపై ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే గంటలో సుమారు మూడు నుంచి నాలుగు దుక్కు లు వర్షం కురిసిందని పలువురు పేర్కొంటు న్నారు. వర్షంతో పాటు ఈదురుగాలులు వీయడంతో చాలా చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌పార్మర్లు దెబ్బతిన్నాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ స్థంభాలపై చెట్లు పడిపోవడంతో కొద్దిసేపు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.ఉండ్రాజవరం నుంచి చివటం వెళ్లే రోడ్డులో కొబ్బరిచెట్టు విద్యుత్ తీగలపై పడింది.ఉండ్రాజవరం, తాడిపర్రు, మోర్త, వెలగదుర్రు గ్రామాల్లో ఈదురు గాలులుకు అరటి చెట్లు పడిపోయాయి. పలు చోట్ల వరిచేలు నేలకొరిగాయి. అక్కడక్కడా అరటి చేలు నేలవాలాయి.



ఉండ్రాజవరంలో నేలకొరిగిన వరి చేను





వెలగదుర్రులో నేలకొరిగిన అరటితోట..తీపర్రులో కూలిన చెట్టు



కాకరపర్రు వద్ద అరటితోటలో నిలిచిన నీరు

ప్రజలకు త్వరలో సన్నబియ్యం

రాజమహేంద్రవరం సిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం త్వరలో ప్రజలకు సన్నబియ్యం పథకం అందించబోతుందని మాజీఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు శనివారం తెలిపారు. జూన్ 12న ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారన్నారు. తొలుత రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు పంపిణీ చేస్తారని, తదుపరి రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు అందిస్తారన్నారు.

పేదలకు వైద్యసేవలు అందజేయాలి : ఎమ్మెల్యే


కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్య తరగతి ప్రజలకు సేవాదృక్పథంతో వైద్యసేవలు అందజేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటుచేయాలని సూచించారన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి స్పీడ్ హైవేతో అనుసంధానంగా ఉన్నందున పోలవరం, నిడదవోలు, దేవరపల్లి, గోపాలపురం, తాళ్లపూడి, చాగల్లు మండలాల నుంచి ఇక్కడికే రావడం జరుగుతుందన్నారు. దీనికితోడు రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రిని మెడికల్ కాలేజీగా మార్పు చేయడంతో, కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిని 150 పడకలు ఏర్పాటుచేసి, జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు అందించామన్నారు. అందుకుగాను జిల్లా ఆసుపత్రి ఏర్పాటుకు అవసరమైన భవనాలు, సౌకర్యాలు కల్పనకు రూ. 20 కోట్లు ఖర్చు అవుతుందని, దానిలో రూ. 10 కోట్లు దాతల సహకారంతో ఏర్పాటు చేస్తామని తెలియజేశామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్, బీజేపీ కౌన్సిలర్ పిల్లమర్రి మురళీకృష్ణ మాట్లాడారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డేగల రాము, సూరపనేని చిన్ని, బీజేపీ నేత బోడపాటి ముత్యాలరావు, జనసేన నేత మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఆసుపత్రి వైద్యులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆర్వోబీని త్వరితగతిన పూర్తిచేయాలి


నిడదవోలులో పనులు పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, తదితరులు

నిడదవోలు, మే 9 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలో జరుగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులతో మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలన్నారు. ఆయనవెంట రోడ్లు భవనాల శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేస్తాం'


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

కొవ్వూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేస్తామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయాన్ని పరిశీలించారు. దీనిలో భాగంగా అన్ని విభాగాలను తనిఖీచేశారు. పాఠకులకు గ్రంథాలయం నుంచి అందుతున్న సేవల గురించి అడిగితెలుసుకున్నారు. గోనుగుంట్ల మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మం త్రిగా ఉన్న సందర్భంలో ప్రారంభించిన గ్రం థాలయమన్నారు. ఇటీవల రాజ్యసభ సభ్యులు వి. విజయేంద్రప్రసాద్ అందించిన నిధులతో గ్రంథాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న రిఫరెన్స్ విభాగం భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జీవీవీఎన్. త్రినాథ్, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

దూబచర్లలో ఉచిత నేత్ర వైద్యశిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న లయన్స్ క్లబ్ వైద్య బృందం

నల్లజర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): దూబచర్లలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ దూబచర్ల, పార్ట్ ఇండియా సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. నిడదవోలు రాజేశ్వరి, రామకృష్ణన్ లయన్స్ నేత్ర ఆసుపత్రి వైద్యబృందం పాల్గొని 100 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. ఇందులో 10 మందికి ఆపరేషన్ నిమిత్తం నిడదవోలు ఆసుపత్రికి రిఫర్ చేశారు. అనంతరం పలు విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో క్యాంప్ ఆర్గనేజర్ అంబటి శ్రీనివాసరావు, కెల్లా వాసు, కూచిపూడి ఉదయ భాస్కరరావు, గుదే సుబ్బారావు, చీమకుర్తి కృష్ణప్రసాద్, మైనం సింహ, దూబకంట్ల రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జంతు హింస నివారణ సంఘ సభ్యుడిగా బలుసు



నల్లజర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా జంతు హింస నివారణ సంఘ సభ్యుడిగా ముసుళ్లకుంట మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు బలుసు గంగరాజును ఎంపిక చేసినట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను ఆయన శుక్రవారం ముసుళ్లకుంటలో గంగరాజుకు అందించారు. తనకు ఈ పదవి ఇవ్వడంపై గంగరాజు ఎమ్మెల్యేకి, పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణాభివృద్ధే ధ్యేయం : చైర్మన్ భూపతి


సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, మే 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పట్టణాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధిపర్చడమే తమ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో అజెండాలోని అంశాలను ఆమోదించడంతో పాటు వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి తన పదవికి ఇచ్చిన రాజీనామా లేఖను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం పట్టణంలోని ఇంటి పన్నుల వసూళ్లలో గత ఏడాది కన్నా .. ఈ ఏడాది ఒక కోటి ముప్పై ఒక్క లక్ష రూపాయలను అదనంగా వసూలు చేసినందుకు మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, మున్సిపల్ రెవెన్యూ అధికారిణి ఎం.నాగకుమారి, సిబ్బందిని కౌన్సిల్ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

తాళ్లపూడిలో శివపార్వతుల రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తాళ్లపూడి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తాళ్లపూడిలో వేంచేసియున్న పార్వతీ సహిత ఉమాపరమేశ్వరస్వామి వారి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు జంధ్యాల గంగాధర శర్మ, అశ్వనీదత్ మాట్లాడుతూ గురువారం రాత్రి శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. ఇందులో పరస శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నట్టు చెప్పారు. అనంతరం భక్తులు పలువురు వచ్చి పూజలు నిర్వహించారు.

వైద్యం కోసం ఆర్థిక సహాయం


సహాయాన్ని అందిస్తున్న జోడాల వెంకటేశ్వరరావు, తదితరులు

తాళ్లపూడి, మే9 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేటలో పిడుగుపాటుకు గురై గాయాల పాలైన బొర్రా వీరలక్ష్మికి వైద్యం కోసం మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు తన మిత్ర బృందంతో కలిసి ఆ కుటుంబానికి రూ. 21 వేల ఆర్థికసహాయాన్ని శుక్రవారం అందించారు. జోడాల రమాదేవి, నందన ఫౌండేషన్ అధ్యక్షుడు రవి, దేవోక్తి సంస్థ అబేద్నగో, ఉపాధ్యాయురాలు జేడీ సునీత, గుడ్ కేర్ హెల్పింగ్ సొసైటీ స్థాపకురాలు వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక : ఎమ్మెల్యే


పల్లంట్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): గోపాలపురం నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. పల్లంట్లలో టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు ఇంటి వద్ద శుక్రవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లంట్ల గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అలాగే యర్నగూడెం నుంచి పల్లంట్ల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. దళితపేటల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఏరియాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి కృషిచేయడం జరుగుతుందన్నారు. లక్ష్మీపురం, దేవరపల్లి, పల్లంట్ల, కురుకూరు వరకు రోడ్డు నిర్మాణానికి కేంద్రమంత్రి నితిన్‌గట్కారీతో సంప్రదించి, అలాగే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో రోడ్డు నిర్మాణాలు చేపడతామన్నారు. నియోజకవర్గంలో 45 బోర్లకు 12 బోర్లు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, టీడీపీ నాయకులు కొయ్యలమూడి చినబాబు, కొయ్యలమూడి సుధారాణి, గన్నమని హరికృష్ణ, ఉప్పులూరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా చౌదరి



కొవ్వూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా వీవీఎస్ చౌదరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన కె. ప్రసన్నకుమార్ మార్చి 31వ తేదీన పదవీ విరమణ చేశారు. ఈ స్థానంలో కొయ్యలగూడెం పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చౌదరి పదోన్నతిపై విచ్చేశారు. దీనిలో భాగంగా చౌదరికి కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అసత్య ప్రచారం చేస్తే సహించం


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ మండలాధ్యక్షుడు వెంకట సుబ్రహ్మణ్యం

నల్లజర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీమంత్రి తానేటి వనితపై అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని వైసీపీ మండలాధ్యక్షుడు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం నల్లజర్లలోని ఆయన ఇంటి వద్ద పార్టీ మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో చురుగ్గా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వనితపై ఒక ఛానల్ దుష్ప్రచారం చేస్తుందని, వాస్తవలు లేని వార్తలను వండివార్చుతుందన్నారు. బంకా అప్పారావు, నక్క పండు, అచ్యుత శివాజీ,చెల్లు హరిబాబు,మునాఫ్,పెనుమాక వెంకట రత్నం, గాలింకి రాంబాబు, యజ్జవరపు లక్ష్మీ, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి విషయంలో అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని అధికారులు ప్రభుత్వం అమలు చేసే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అభివృద్ధి విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించినా సహించబోమని హెచ్చరించారు. గత ప్రభుత్వం 11,513 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే... ఈ ఏడాది ప్రభుత్వం 16 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని, మరో 2,500 మెట్రిక్ టన్నులు కొనుగోలుకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. రైతులకు ఏ దశలోనూ ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ. 56 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామ న్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాల యంలో కుట్టుమిషన్ల శిక్షణలో పాల్గొన్న మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లా డుతూ మండలంలో రూ. 24 లక్షలతో తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా మోటార్లు ఏర్పాటు చేయడం జరిగిగిందన్నారు. ప్రస్తుత పరిస్థితులు కుట్టుమిషన్లకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. దేవరపల్లిలో 144 మంది రెండు బ్యాచ్‌లుగా శిక్షణలో పాల్గొనటం అభినందనీయమన్నారు. ఎంపీడీవో ఎస్.వేణు గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, అన్నిశాఖల అధికారులు, గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వలీబాషా కుటుంబానికి పరామర్శ


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

నిడదవోలు, మే 9 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలో గత ఆదివారం హత్యకు గురైన వలీబాషా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం హైద్రాబాద్ నుంచి వచ్చిన ఎంఐఎం ప్రతినిధి బృందం, స్థానిక ముస్లిం సోదరులతో కలిసి ర్యాలీ నిర్వహించింది. ఈ మేరకు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా కల్పించారు.

చాగల్లులో భారీ అన్నసమారాధన


అన్నసమారాధనను ప్రారంభిస్తున్న దాతలు డాక్టర్ ఆలపాటి సాంబశివరావు దంపతులు

చాగల్లు, మే 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంటర్‌లోని శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్తలు డాక్టర్ ఆలపాటి సాంబశివరావు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. దాతలు డాక్టర్ ఆలపాటి సాంబశివరావు దంపతులు భక్తులకు అన్నం వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. యువకులు, గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం


చిక్కాలలో కిశోర బాలికల వికాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు, మే 9 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి. పద్మావతి అన్నారు. కిశోర బాలిక వికాసం శిక్షణ తరగతులలో భాగంగా చిక్కాలలోని అంగన్‌వాడీ కేంద్రం - 130లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ బాలికలు ఫాస్ట్‌ఫుడ్స్ తినడం మానుకుని, పండ్లు, ఆకుకూరలు తినాలన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మి, ఏఎన్ఎం సత్యవేణి , తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: బాల్య వివాహలను అరికట్టాలని పెరవలి ప్రాజెక్టు సీడీపీవో శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం సూర్యారావుపాలెంలో అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సూపర్‌వైజర్ సరస్వతి, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ దూబచర్లలో శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం ముప్పిడి సుహాసిని మాట్లాడుతూ బాల్యవివాహాలు చేస్తే బాలికలకు గర్భసంచి తయారు కాకుండా గర్భం దాలిస్తే పుట్టే బిడ్డలు వికలాంగులు, రక్తహీనతతో పుడతారని పేర్కొన్నారు. అలాగే ప్రకాశరావుపాలెంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జార్జ్‌విక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో అంగన్‌వాడీ సిబ్బంది బాల్యవివాహాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి, బేబి సూర్యకళావతి, విమల, మంగరాణి, దేవకి, పేరంటాలు, తదితరులు పాల్గొన్నారు.


సూర్యారావుపాలెంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో శ్రీలక్ష్మి

లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతి


పెరవలి రైతుసేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న రాధిక

పెరవలి, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంకా లక్ష టన్నుల మేర ధాన్యం కొనడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ రాధిక తెలిపారు. శుక్రవారం పెరవలి, తదితర రైతుసేవా కేంద్రాలను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు రైతులకు రూ. 550 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని, ఇంకా వంద కోట్ల వరకు బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. ఈమెతోపాటు వ్యవసాయాధికారి మేరీ కిరణ్, ఆర్ఐ పావని, తదితరులు ఉన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కి మద్దతుగా కొవ్వొత్తుల ప్రదర్శన


నెలటూరులో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న టీడీపీ నాయకులు

చాగల్లు, మే 9 (ఆంధ్రజ్యోతి) : భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధవాతావరణం నేపథ్యంలో ఆపరేషన్ సింధూర్‌కి మద్దతుగా సంఘీభావం తెలుపుతూ నెలటూరులో టీడీపీ శ్రేణులు శుక్రవారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించాయి. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం వర్ధిల్లాలని, జైజవాన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు తాళ్లూరి హరిశ్చంద్రప్రసాద్ మాట్లాడుతూ భారతదేశ సైన్యం ధైర్యసాహసాలను కొనియాడారు. పాకిస్తాన్‌కి తగిన గుణపాఠం చెప్పేలా ప్రధాని మోదీ తీసుకుంటున్న నిర్ణయాలకు ప్రజల సంపూర్ణ మద్దతు ఉందని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈడుపుగంటి సుబ్బారావు, టీడీపీ నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, ఈడుపుగంటి మురళి, కుసులూరి సతీష్, నందిగం సురేంద్ర, ఈడుపుగంటి నాగేశ్వరరావు, బైపిన సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలు తీర్చడమే మా కర్తవ్యం : ఎమ్మెల్యే వాసు



రాజమహేంద్రవరం సిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలు తీర్చడమే తమ కర్తవ్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక దానవాయిపేట గాంధీ పార్కులో రూ.4 లక్షలతో భవాని చారిటబుల్ ట్రస్టు, పరమేసు బయోటెక్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి నేపథ్యంలో ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో మరో రెండు ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పార్కు అభివృద్ధి కమిటి సభ్యులతో సమావేశం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతోందని ఎమ్మెల్యే అన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వితంశెట్టి ప్రసాద్

జంతు హింస నివారణ జిల్లా సొసైటీ కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన వితంశెట్టి కిరణ్ ప్రసాద్.. ఎమ్మెల్యే వాసును ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కు అభినందనలు తెలిపి పదవికి న్యాయం చేయాలన్నారు. సమాజంలో చేస్తున్న సేవలను గుర్తించి ఇచ్చిన పదికి వన్నెతీసుకువస్తానని ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.